ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

## ప్రజలు ఇంటి వద్దే ఉండాలి

**-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**ప్రజాశక్తి-హుకుంపేట :** మొంథా తుఫాన్ ప్రభావం ఈనెల 29 మద్యాహ్నాం వరకు ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం తుఫాను ప్రభావ ప్రాంతాల పరిశీలనలో భాగంగా హుకుంపేట గడికించుమండ గ్రామాన్ని సందర్శించారు. పర్యటనలో కచ్చా ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను హుకుంపేట గడి కించుమండ సచివాలయంలో పునరావాసం కల్పించారు. పిల్లలను ఇంటి నుండి బయటకు రాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో పునరావాస కేంద్రంలో ఉంటున్న వారికి మంచి ఆహారము, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ఈ పర్యటనలో ఇంచార్జ్ ఆర్డీఓ లోకేశ్వరరావు,వ్యవసాయ అధికారి కె.సుధాకర్, తహసీల్దార్ శ్రీనివాసరావు, అధికారులు సిబ్బంది ఉన్నారు.

# మొంథా బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, ఇళ్లు ధ్వంసం
- గ్రామాలకే పరిమితమైన ఆదివాసీలు
- అప్రమత్తమైన అధికారులు
- సప్పర్ల ఘాట్‌రోడ్‌లో రాకపోకలు నిషేధం
- పర్యాటక కేంద్రాలు మూసివేత

**మొంథా తుపాను అల్లూరి జిల్లాలో మంగళవారం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో ఆదివాసీ గ్రామాలు గజగజా వణికాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.**

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మంగళవారం వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో మండలంలో లబ్బర్తి, దూసరపాము తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారికి అడ్డంగా కూలిన చెట్లను యుద్ధ ప్రాతిపదిగిన రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్ ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. మండలంలోని వెనకర్రై గ్రామంలో పెద్ద చింతచెట్టు మేకల కొట్టంపై కూలిపోయింది. ఒక మేక మృతి చెందింది. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఇతర శాఖల అధికారులు వొట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల తదితర గ్రామాల వద్ద వాగులను పర్యవేక్షించి వాగులు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటవద్దని సూచించారు. వాగుల వద్ద అధికారులు పహారా ఉన్నారు. ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు ఇతర శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**దేవీపట్నం:** మండలవాసులు తుఫాన్ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండా లని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ సూచించారు. మంగళవారం దేవీపట్నం మండలంలో ఇందుకూరు, ఇందుకూరుపేట, పెద్దబీంపల్లి, లోతుపాలెం, చాపరాయిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు వంతెనలు, కల్వర్టులను పరిశీలించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని పిఒ తెలిపారు. తుపాను వలన బాధపడుతున్న వారు ఐటిడిఎ కంట్రోల్ రూమ్ 08864 – 242114కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. స్పెషల్ మైనర్‌ఇరిగేషన్ ట్యాంకులు పరిశీలించారు. తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**సీలేరు:** జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ తోకరాయి గ్రామస్తులను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మండల రెవిన్యూ అధికారులు, పోలీసులకు ఆదేశించారు. సీలేరు ఎస్ఐ యాసీన్ మంగళవారం దారకొండ పంచాయతీ తోకరాయి చేరుకుని తుఫాను గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సురక్షిత పునరావాస కేంద్రాలకి తరలిరావాలని తరలిరావాలన్నారు. గ్రామస్తులని దారకొండ పునరావాసంగా ఏర్పాటు చేసిన ఎంపిపి స్కూల్ కి తరలించారు. బస చేయడానికి వసతి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామస్తులను సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు జికె వీధి ఎస్ఐ, రెవెన్యూ అధికారులు తరలించారు.

వెనకరైలో చెట్టు కూలి మృతి చెందిన మేక

**కొయ్యూరు:** చింతపల్లి, నర్సీపట్నం రహదారిలో డౌనూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో తమ సిబ్బందిని అక్కడకు పంపించిన ఎస్సై కిషోర్‌వర్మ స్థానికుల సహకారంతో చెట్టు తొలగించారు. రాకపోకలను పునరుద్ధరించారు. అనంతరం చింతలమ్మ ఘాట్ రోడ్లో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ కిషోర్‌వర్మ వాహనాల రాకపోకలను పరిశీలిస్తూ భారీ వాహనాలను నెమ్మదిగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం రాజేంద్రపాలెంలో గిరిజనులకు అవగాహన కల్పించారు.

**జీకే వీధి :** రింతాడ పంచాయితీ పనసలొద్ది గ్రామంలో మంగళవారం పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ఇంటిపై భారీ చింతచెట్టు ఒక్కసారిగా కూలడంతో ఆ ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, అదష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ సిబ్బందితో పాటు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంటనే గ్రామస్తుల సహకారంతో చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. తుఫాన్ కారణంగా ఏ క్షణంలోనైనా విద్యుత్ స్తంభాలు ఒరిగిపడి విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడితే మంచినీటి సరఫరాకు సమస్య తలెత్తుతుందని ప్రజలు మంచినీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎపి జెన్కో అధికారులు తెలిపారు.

జికె వీధి: పనసలొద్ది గ్రామంలో కూలిన చెట్టును తొలగిస్తున్న అధికారులు

**సప్పర్ల ఘాట్‌రోడ్‌లో రాకపోకలు నిషేధం**

తుఫాను వలన ఎటువంటి నష్టం జరగకుండా జికె వీధి మండలం సీలేరు, సప్పర్ల ఘాట్‌రోడ్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ యాసీన్ వాహన రాకపోకలు తాత్కాలికంగా నిషేధించారు.

**పర్యాటక కేంద్రాలు అప్రమత్తం**

**మోతుగూడెం:** మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఉన్న పర్యాటక ప్రాంతాల్లో చింతూరు సిఐ ఎస్ఐ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజులు తుఫాను ప్రభావం ఉంటుందని పర్యాటకులు సీలేరు నది వైపునకు, సోకులేరు వాగు వాటర్ ఫాల్స్ వద్దకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేసారు.

**ఎటపాక:** తుఫాను వలన ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకుండా నష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపిడిఒ నాగమణి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ పుల్లయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రచారం చేశామని అత్యవసర చర్యలో భాగంగా ప్రజలను తరలించడానికి 52 ట్రాక్టర్లు ఏర్పాటు చేశామని, 46 రిలీఫ్‌సెంటర్లను సిద్ధం చేశామని, జనరేటర్లు ఏర్పాటు చేశామని, చెట్లు పడితే తొలగించడానికి 7 జెసిబిలు సిద్ధంగా ఉంచామని తెలిపారు.

కొయ్యూరు: చెట్టు తొలగింపు చర్యలు చేపడుతున్న ఎస్ఐ కిషోర్‌వర్మ

సీలేరు: సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న తోకరాయి గ్రామస్తులు

దేవీపట్నం: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

## బలిమెల నుంచి నీరు విడుదల

**సీలేరు:** ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ సమీపంలో ఉన్న బలిమేల జలాశయానికి వరద నీరు పోటెత్తే ప్రమాదం ఉందని దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలైన గుంటవాడ, సీలేరుతో పాటు గిరిజన గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒరిస్సా అధికారులు అప్రమత్తం చేశారు. మంగళవారం ప్రత్యేక వాహనంలో సీలేరు చేరుకొని తుఫాను వలన కలిగే నష్టాలపై విస్తతంగా ప్రచారం చేశారు. బలిమెల రిజర్వాయర్లో నీటిమట్టాలు ప్రమాదస్థాయికి పెరగవచ్చని పూర్తిస్థాయి నీటిమట్టాలకు వరద నీరు చేరితే దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తామని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

చింతపల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

**ప్రజాశక్తి-చింతపల్లి :** మొంథా తుఫాన్ మారుమూల గ్రామాలను వణికిస్తోంది. మండలంలోని బలపం పంచాయతీ పరిధి రాళ్లగెడ్డ గ్రామంలో మంగళవారం ఉదయం భారీ గాలి, వర్షాలకు చెట్టు వేళ్లతో సహా కూలిపోయి రెండు ఇళ్లపై పడింది. దీంతో గెమ్మెలి సన్యాసిరావు, సిందేరి రమణ గృహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చెట్టు పడిన శబ్ధంతో ఇళ్ల ఉన్న పిల్లలు, మహిళలు భయంతో బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో విద్యుత్ స్తంభం కూడా విరిగి కూలిపోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. ఇళ్ల గోడలు పగిలిపోవడంతో పాటు పైకప్పు పూర్తిగా శిథిలం కావడంతో రూ.లక్షల్లో నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ఎంపీడీవో, తహశీల్దార్, విద్యుత్ శాఖ వెంటనే స్పందించి చెట్టు తొలగించి, నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని సన్యాసిరావు, రమణ కోరుతున్నారు.

**పొంగుతున్న గెడ్డలు**

**అనంతగిరి:** మండలంలోని ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న మొంథా తుఫాన్ ప్రభావంతో గెడ్డలు వాగులు వంకలు, పొంగి ప్రవేశిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగడమే కాకుండా గట్లు దెబ్బతింటున్నాయి. బీంపోలు. రామచంద్రపురం. గరుగుబిల్లి. సీతంపెట. కాశీపట్నం. లుంగపర్తి .ఓనుకొండ. కడరేవు కరిగోడ. మర్దగుడ. కమలాపురం. తదితర గ్రామాలకు ఆనుకుని ఉన్న గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి దీనితో రాకపోకల సాధించే స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. 24 పంచాయతీ గ్రామాలలో వరి పంట నీట మునిగింది. ప్రభుత్వం గుర్తించి తమకు ఆర్థిక సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

## మన్యం గజగజ

### పొంగుతున్న గెడ్డలు

**జిమాడుగుల:** వర్షం, ఈదురుగాలులతో మన్యంలో జనజీవనం స్తంభించింది. మండలంలో కొక్కిరాపల్లి ఘాటి మార్గమధ్యలో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో, అప్రమత్తమైన పోలీసులు తొలగించారు. గెమిలి పంచాయతీ జి.కొత్తూరు గ్రామంలో బొంగరం వెంకట్రావు అనే గిరిజనుడికి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. ఎటువంటి ప్రాణహాని జరగక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కుమ్మిడిసింగి పంచాయతీ రాళ్లగడ్డ వద్ద జల ప్రవాహం పొంగి ప్రవహించడంతో స్థానిక తహసిల్దార్ గిడ్డి రాజు కుమార్ వంతెన సమీపం వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మంగళవారం వారపు సంత కావడంతో మండల కేంద్రంలో కొనుగోలుదారులు రాక దుకాణాలు వెల వెల పోయాయి.

జి.మాడుగులలో కూలిన ఇల్లు

**వంతెనలపై నీటి ప్రవాహం**

**హుకుంపేట :** మండలంలో తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో వంతెనల మీదుగా నీరు ఉదృతంగా ప్రవహిస్తోంది. హుకుంపేట మండలంలోని ఒంటిపాక, లివిటి, ఓల్డా ఉప్ప సమీప వంతెన, చీడిపుట్టు, అడ్డుమండ వంతెనలపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి.అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్థులు స్వచ్ఛందంగా వంతెనల వద్ద అడ్డుకట్టలు వేసి సురక్షితంగా ఉన్నారు. రహదారులపై ఎవరూ కనబడకపోవడంతో హుకుంపేట పట్టణం ప్రశాంతంగా మారింది. వర్షం కారణంగా మార్కెట్‌లో దుకాణాలు ఖాళీగా, హుకుంపేట పెట్రోల్ బంక్ వద్ద కూడా జనసంచారం లేకుండా కనిపించింది.

ముంచంగిపుట్టులో కూలిన చెట్టు

**ముంచింగిపుట్టు:** మండలంలోనీ లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో మంగళవారం విపరీతమైన ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా మామిడి చెట్టు నేల మట్టమయ్యింది. లక్ష్మీపురం నుంచి బుంగపుట్టు పంచాయతీల ప్రజలు రాకపోకలు స్తంభించాయి. మంగళవారం సాయంత్రం నుండి విపరీతమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. జోలాపుట్టు రిజర్వాయర్‌లోని గేట్లను ఎత్తి నీళ్లను విడుదల చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రామకృష్ణ సూచించారు.సహాయం కోసం పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ :9440904233 సంప్రదించి వివరాలు తెలపాలని కోరారు.

**డుంబ్రిగుడ:** మొంథా తుపాన్‌తో మండలంలో సోమవారం నుంచి మంగళవారం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈ తుపాన్‌తో మండలంలోని గిరిజనులు బయటికి రాకుండా ఎక్కడి వారు అక్కడే ఉంటూ ఇంటికే పరిమితమయ్యారు. చంపపట్టి, కోసంగి, గొరపూర్, చాపరాయ్ గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో, ఆ ప్రాంత గిరిజనులు బయటికి రాకుండా గ్రామాలకే పరిమితమవుతున్నారు. గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో సీలంగొంది, చంపాపట్టి, జాకర వలస, పెదపాడు, కొసంగి, తోకవలస గ్రామాల గిరిజనులు నిత్యావసర సరుకుల కోసం ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో నివాసముంటున్న సి ఆర్ పి నాగేంద్ర నివాస గృహంపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి.

**అనంతగిరి:** మండలంలోని గత రెండు రోజులుగా మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా ఇల్లు నేల మట్టం కావడమే కాకుండా మూగజీవులు మృత్యువాతకు గురవుతున్నాయి. కోనాపురం పంచాయతీ బొండియాగూడ గ్రామానికి చెందిన కిలో అర్జున్, వాలసి పంచాయతీ కుంబర్తి గ్రామానికి చెందిన అప్పన్న, చీడివలస గ్రామానికి చెందిన సివేరి .ప్రేమ్ రాజు, అనంతగిరి పంచాయతీ నందిగుమ్మి గ్రామానికి చెందిన దీసరి. చిన్నయ్య ఇల్లు గోడలు కూలి పోయాయి.. అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామానికి చెందిన జన్ని. సింహద్రి పశువు మృతి చెందింది. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించే ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అనంతగిరి మండలం రామచంద్రపురం వద్ద వంతెన పై నుంచి ప్రవహిస్తున్న నీరు

**సురక్షిత ప్రాంతాలకు తరలింపు**

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** మొంథా తుపాన్ ప్రభావంతో అధికారులు గిరిజనులను సురక్షిత ప్రదేశానికి తరలిస్తున్నారు. అరకులోయ మండలం లోతేరు పంచాయితీ పెద్దగెడ్డ గ్రామానికి చెందిన 3 కుటుంబాలు, 16 గిరిజనులను దనసానివలస ఎంపీపీ పాఠశాలకు పంచాయతీ అధికారులు తరలించారు. సుంకరమెట్ట పంచాయతీ పిరిబంధ గ్రామానికి చెందిన గిరిజనులకు ఎంపీడీవో లవరాజు, సిఐ హిమగిరి, ఎంఆర్ఓ ,ఇంచార్జి ఎంపీడీవో పిరిబంద గ్రామంలో మంగళవారం పర్యటించి సురక్ష ప్రాంతానికి ఉండాలని ఆదేశించారు. .తుఫాను ప్రభావంతో పూర్ణ చర్య ఘాట్ రోడ్డు లో కొండ చరియలు విరిగిపడే అవకాశాలు ఉన్నాయని దీంట్లో దృష్టిలో పెట్టుకొని వాహనాలు రాకపోకలు చేయకూడదన్నారు.

**డుంబ్రిగుడ:-** తుపాన్‌తో మండలంలో సోమవారం నుంచి మంగళవారం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది.ఈ తుపాన్ తో మండలంలోని గిరిజనులు బయటికి రాకుండా ఎక్కడి వారు అక్కడే ఉంటూ ఇంటికే పరిమితమయ్యారు. చంపపట్టి,కోసంగి, గొరపూర్, చాపరాయ్ గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.దీంతో ఆ ప్రాంత గిరిజనులు బయటికి రాకుండా గ్రామాలకే పరిమితమవుతున్నారు.గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో సీలంగొంది, చంపాపట్టి, జాకర వలస,పెదపాడు,కొసంగి,తోకవలస గ్రామాల గిరిజనులు నిత్యావసర సరుకుల కోసం ఇబ్బంది పడుతున్నారు.మండల కేంద్రంలో నివాసముంటున్న సి ఆర్ పి నాగేంద్ర నివాస గహంపైన చెట్టు కొమ్మ విరిగి పడడంతో పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి.

# ముంపు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించండి

**- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**ప్రజాశక్తి-పాడేరు:** మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో ఎక్కడ ఎంత చిన్న సమస్య అయినా మా దృష్టికి తేవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జిల్లాలో మొంథా తుపానుకు సంబంధించి సంబంధిత అధికారుకారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పడుతున్న వర్షాల వల్ల జరిగిన నష్టాలపై సమీక్షించారు. అందరు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ముందస్తు చర్యలను పర్యవేక్షించాలన్నారు. అందులో కచ్చా (మట్టి) గృహాల నివాసితులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలాన్నారు. రహదారులపై చెట్లు, కొమ్మలు విరిగి పడిన తక్షణమే వాటిని తొలగించి అంతరాయం లేకుండా చూడాలన్నారు. రాత్రి వేళల్లో రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల అలెర్ట్ చేయాలన్నారు. గ్రామంలో ఏదైనా జరిగితే వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వాలని తెలిపారు. చెట్లు పడి విద్యుత్ తీగలు తెగిపోయాయన్న సమస్య ఉండరాదన్నారు. ప్రతి రెండు గంటలకి ఒకసారి సమాచారం అందజేయాలనీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. అంబులెన్సులు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. జనరేటర్లు, డీజిల్, విద్యుత్ స్తంభాలు, ఇసుక బస్తాలు అవసరం అనుకునే ప్రాంతాలకు ముందుగా తరలించాలన్నారు. పురాతన, శిదిల భవనాలను గుర్తించి, ఎవరూ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, తహసిల్దార్లు వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల మీద అవగాహన కల్పించాలన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. గృహాల్లో, పాఠశాలల్లో వాటర్ ట్యాంక్ నింపుకొని ఉంచాలన్నారు.

జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ మహిళా పోలీసులు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నారన్నారు. మహిళా పోలీసులు పనిచేసే కేంద్రంలో ఉండాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

## మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలి

**ప్రజాశక్తి-గొలుగొండ:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో మంగళ వారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటి కరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాలు సేకరణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేయడంతో పేదవాడికి వైద్య సేవలు దూరమవుతాయన్నారు. కూటమి ప్రభుత్వానికి పేద ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 కళాశాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంటే, ఈ ప్రభుత్వం వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

## గర్భిణికి తప్పని కష్టాలు

**- గెడ్డలో తరలింపు**

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** ఏళ్లు గడుస్తున్నా గిరిజన ప్రాంతంలో గిరిజనులకు కష్టాలు తీరడం లేదు.తుపాను, భారీ వర్షాలు కురిసినప్పుడు గర్భిణీలు, వ్యాధి గ్రాస్తులను హాస్పిటల్ కు తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. మొంథా తుపాను ప్రభావంతో గెడ్డ ఉధృతితో ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఉంది.మంగళ వారం పురిటి నొప్పులతో విలవిలాడుతున్నా గర్భిణికి ఇంటి వద్దే సఫర్యాలు చేయలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న గిరిజన కుటుంబానికి వైద్య సిబ్బంది సాహసం చేసి ఆసుపత్రికి తరలించిన సంఘనట అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతంగి పంచాయతీ ఉయ్యలగుడ శీలంగొంది గ్రామానికి చెందిన జి అనిత అనే గర్భిణికి మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. బాధిత కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు. వైద్య సిబ్బందితో కితలంగి కాజ్వేకు చేరుకున్నారు. కాజ్వే ఉధృతితో బాధితురాలి గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది.

గర్భిణికి ఆసుపత్రికి తరలించేందుకు వైద్య సిబ్బంది అతికష్టం మీద పోలీసుల సాయంతో ఆ గ్రామానికి చేరుకుని గర్భిణికి కాజ్వేకు తీసుకొచ్చారు. కాజ్వే ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అవతలి ఒడ్డుకు చేరుకునేందుకు చీకటి అలుముకోవడంతో అతికష్టం మీద అవతలి ఒడ్డుకు చేర్చి 108 అంబులెన్సో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహించి డుంబ్రిగుడ పీహెచ్సీకు తరలించారు. పైలట్లు జగదీష్, సురేష్, ఈఎంటీ నాయుడు, డీఎంవో రాకేష్వర్ధన్, ఏఎన్ఎంలు సునీలారాణి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

| | |
|---|---|
| సిటీ : 9490099125 | పూర్ణమార్కెట్ : 9490099676 |
| మధురవాడ : 8008596645 | జగదాంబ : 9490099434 |
| గాజువాక : 9849392359 | జివియంసి : 9490099483 |
| అనకాపల్లి : 8008736188 | ద్వారకానగర్ : 9490099672 |
| చోడవరం : 9490099141 | కంచరపాలెం : 9490099135 |
| నర్సీపట్నం : 9440280411 | మాదవధార : 9490099675 |
| పాడేరు : 9490099142 | |
| రంపచోడవరం : 9440165617 | |

నిలిచిన భవనం పనులు

## అర్ధాంతరంగా నిలిచిన భోజనశాల భవనం

### - 15 ఏళ్లగా పట్టించుకోని అధికారులు
### - తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-చింతపల్లి :** చింతపల్లి మండలంలోని లోతుగడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థుల భోజనశాల కోసం 15 ఏళ్ళ క్రితం ప్రారంభించిన భవనం నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో నాటి నుండి విద్యార్థులు భోజనాలు చేయడానికి సరైన సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 430 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారందరూ ప్రతిరోజూ భోజనాలు చేయడానికి ప్రత్యేక భోజనశాల అవసరం ఉంది. ఈ కారణంగానే15 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో అప్పట్లో నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదులు, పిల్లర్స్ వరకు మాత్రమే పనులు జరగగా, అప్పటి నుండి ఆ పనులు నిలిచిపోయాయి. స్లాబ్ వేయకపోవడంతో పిల్లర్స్, గోడులు క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పిల్లర్స్ మధ్య ఏపుగా గడ్డి, పొదలు పెరిగాయి. భోజనశాల అర్ధాంతరంగా నిలచిపోవడంతో విద్యార్థులు ప్రస్తుతం తాత్కాలిక రేకుల షెడ్‌లోనూ, వర్షం లేని రోజుల్లో బహిరంగ ప్రదేశాల్లోనూ భోజనాలు చేస్తున్నారు. వర్షాకాలం అయితే విద్యార్థులు భోజనాలు చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తడిసిన నేల మీద కూర్చుని భోజనం చేయాల్సి దుస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిజంగానే గిరిజన విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచిస్తే 15 ఏళ్ళుగా నిలిచిపోయిన ఈ భవనం పనులను వెంటనే పున:ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక గ్రామ పెద్దలు మాట్లాడుతూ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంపై పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. పేద గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. పాఠశాల సిబ్బంది కూడా పలుమార్లు పైఅధికారులకు విన్నవించినప్పటికీ, పనులు తిరిగి ప్రారంభించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు, అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తక్షణమే ఈ సమస్యపై స్పందించి భోజనశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

### తక్షణ చికిత్సతో పక్షవాతం నివారణ

**ప్రజాశక్తి - ఆరిలోవ/గాజువాక :** ముందు జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్‌ను నిరోధించవచ్చని, తక్షణమే చికిత్స అందిస్తే పక్షవాతం శాశ్వతం కాదని కేర్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎంజివి.ఆదిత్య తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో అవగాహన పెంచడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం, ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స పొందడం వంటి అంశాలపై దృష్టి సారించేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నిమిషాన్ని లెక్కలోకి తీసుకోండి అనే థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కేర్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జి.కిషోర్‌బాబు మాట్లాడుతూ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లడం ముఖ్యమన్నారు. 40 ఏళ్లు దాటిన వారు, 30 ఏళ్లు పైబడిన వయస్సులో ధూమపానం చేసేవారు, మద్యపానం సేవించే వారు తమ రక్తపోటు, చక్కర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు.

**గాజువాక :** పక్షవాతం వస్తే మొదటి 4 నుంచి 5 గంటలే కీలకమని, ఆ సమయంలో వైద్యం అందిస్తే నివారించవచ్చని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్.విజయ్ తెలిపారు. నడుస్తున్నప్పుడు అదుపుతప్పడం, చూపులో లోపం, మూతి వంకర పోవడం, చేతులు కాళ్లు చచ్చుపడటం, మాట తడబాటు తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నూతన చికిత్సా విధానాలైన థ్రాంబోలైసిస్ లేదా థ్రాంబెక్టమీ ద్వారా మనిషి పూర్తిగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

రైతులకు సూచన చేస్తున్న ఎఒ రాజ్‌కుమార్

## మినుములో వర్షపు నీరు తొలగించాలి

**ప్రజాశక్తి-కొయ్యూరు:** మినుము పంటలో వర్షపు నీటిని తొలగించాలని కొయ్యూరు ఎఒ రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం ఎం.మాకవరం పంచాయతీలో ఆయన పర్యటించారు. సర్పంచ్ చింతల్లి రాజుబాబు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు మోహన్, విహెచ్‌పి సంధ్యారాణి మినుము పంటను పరిశీలించారు. వర్షాల అనంతరం క్లోరిఫైరిఫాస్ పిచికారీ చేయాలన్నారు.

నగదు అందజేస్తున్న మేనేజర్ బాబూరావు

## దావీదు కుటుంబానికి 'మాతోట మ్యాక్స్ సొసైటీ' సహాయం

**ప్రజాశక్తి- జీకే వీధి:** ఇటీవల పెంటపాడు బ్రిడ్జి దగ్గర బైక్ ప్రమాదంలో మృతి చెందిన సురవరం గ్రామానికి చెందిన వాసిరెడ్డి దావీదురెడ్డి (సభ్యుడు) కుటుంబానికి మహిళా మా తోట మాక్స్ సొసైటీ అంత్యక్రియల నిమిత్తం నామినీ అయిన దావీదు భార్య జ్యోతికి రూ.5000 నగదు అందజేశారని మేనేజర్ జల్లి బాబురావు తెలిపారు.. ఇటీవలే 70 వేలు లోను మంజూరు చేశామన్నారు. సొసైటీ నిబంధన మేరకు మానవతా దృకృథంతో దావీద్ సొసైటీకి చెల్లించాల్సిన 63 వేల రూపాయలను సిఇఒ నెల్లూరు వెంకట సత్యనారాయణ మాఫీ చేసినట్లుగా తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



జఫ్రా పొలాన్ని పరిశీలిస్తున్న తూతిక శ్రీనివాస విశ్వనాథ్

## జీవకంచె లేదని సిబ్బందిపై ఆగ్రహం

**ప్రజాశక్తి - మారేడుమిల్లి :** మొంథా తుఫాన్ కారణంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన డ్వామా, రంపచోడవరం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మంగళవారం మారేడుమిల్లి పంచాయతీ అద్దర వీధిలో రైతు కేలెళ చిన్నారెడ్డి ఉద్యానవన జఫ్రా పొలాన్ని పరిశీలించారు. రైతు పొలం చుట్టూ జీవ కంచె (బయో ఫెన్సింగ్) లేకపోవడన్ని తీవ్రంగా పరిగణించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మొక్కలను సంరక్షించే బాధ్యత రైతుతో పాటు ఉపాధి హామీ సిబ్బందిది అని ఎపిడి అన్నారు. జీవకంచె లేకపోతే మొక్కలు పశువులబారిన పడతాయని అసహనం వ్యక్తం చేశారు. పంపిణీ చేసిన మొక్కలన్ని వంద శాతం బ్రతికి రైతులకు జీవనోపాధి కలగాలని ఎపిడి శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జూనియర్ ఇంజనీర్ బి. శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి ప్రయోజనాల కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టులు ?

మీడియాతో మాట్లాడుతున్న పోరాట కమిటీ సభ్యులు జగన్నాథం, హరి

### ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఎవరికి కోసమని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు ప్రశ్నించారు. మంగళవారం అరకులోయలోని హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కో కన్వీనర్లు కిల్లో జగన్నాథం, తాంగుల హరి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఐదోవ షెడ్యూల్ ఏరియాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం బడా కార్పొరేట్ నవయుగ, అదాని, శిరిడి సాయి కంపెనీలకు గిరిజనుల భూములు ధారాదత్తం చేయడానికి హక్కు లేదన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ సమక్షంలో బడా కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిపుణుల సమావేశంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పిఎస్పి ప్రాజెక్టు నిర్మాణంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కనెక్టివిటీ, సీసీ రోడ్లు , టెలి కమ్యూనికేషన్ నెట్వర్క్ ఆరోగ్య క్లినికులు కమ్యూనిటీ భవనాలు, రవాణా సౌకర్యాలు, పాఠశాల భవనాలు వస్తాయని చెప్పడం నమ్మే పరిస్థితి లేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణంతో అటవీ భూములు కేవలం 116 ఎకరాలు ప్రైవేట్ భూములు 1302 ఎకరాలు మాత్రమే ప్రభావితమవుతుందని, కేవలం 304 ఎకరాలు మాత్రమే ముంపుకు గురవుతుందని మొత్తం 72 గుడిసెలు మాత్రమే ముంపు గురవుతాయని జిల్లా కలెక్టర్ ప్రకటించడం బడా కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్ గా వ్యవహరించడమేనని విమర్శించారు. గిరిజనులకు అండగా ఉండవలసిన జిల్లా కలెక్టర్ అబద్ధపు ప్రచారం చేయడమేటని అన్నారు. ఆదివాసులకు భయభ్రాంతులకు గురిచేసి రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని చెప్పారు. చిట్టంవలస, గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే అనంతగిరి, అరకువేలి హుకుంపేట మండలాల పరిధిలో 15 వేల ఎకరాల జిరాయితి భూమి, వేల ఎకరాల అటవీ భూములు,కాఫీ మిరియాల తోటలు, వందల గ్రామాలు వేలాది మంది ఆదివాసులు నిర్వాసితులు అవుతారని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో మూడు మండలాల పరిధిలో పాఠశాల భవనాలు, కనెక్టివిటీ రోడ్లు, టెలికమ్యూనికేషన్, ఉప ఆరోగ్య కేంద్రాలు, జల సమాధి అవుతాయన్నారు. ఆదివాసి హక్కులు చట్టాలు 1/70 చట్టం, అటవీ చట్టం, పెసా గ్రామసభ చట్టం ఉల్లంఘించి గత 70 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిని జల సమాధి చేసి ఆదివాసీ ప్రాంతాన్ని విధ్వంసం సృష్టించి కొత్తగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ మాట్లాడడం సరికాదన్నారు. మెగా కంపెనీల తరపున మాట్లాడటమంటే గిరిజన కుటుంబాలకు ముంచడమే తప్ప మరొక్కటి లేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు, జిఒలు 2, 13, 51 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసుల పోరాట ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

# తుపానుపై ఆందోళన చెందొద్దు: పిఒ

గిరిజనులతో మాట్లాడుతున్న పిఒ

**ప్రజాశక్తి అనంతగిరి:**మొంథా తుఫాన్ ప్రభావ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పునరావాస కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని పాడేరు ఐటిడిఏ పిఒ శ్రీ పూజ అన్నారు. కోనాపురం పంచాయతీ వంటలమామిడి, చప్పుడి గ్రామాలలో పిఒ, ఎమ్మెల్యే మత్స్యలింగం కలిసి పర్యటించారు. ఆయా గ్రామల ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటల మామిడి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు మాట్లాడుతూ ఇప్పటికే తమ గ్రామంలో కొండ చరియలు విరిగి పడ్డాయన్నారు. ఈ సందర్భంగా పిఒ. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ,చప్పడి గ్రామానికి చెందిన 45 కుటుంబాలు, వంటల మామిడి 15 కుటుంబాల ప్రజలకు బొర్రా ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసామన్నరు. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. కొత్తవలస. శివలింగపురం. చిలకలగడ్డ .పిన్నకోట. పెద్దకోట. లుంగపర్తి. వంటి అవసరమున్న చోట పునరావాశ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ వీరభద్రచారి, సర్పంచ్‌లు జె.అప్పారావు, అప్పలమ్మ పాల్గొన్నారు.

**పాడేరు-:** తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి భయాందోళనలకు లోను కావద్దని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గురువారం రాత్రి లేదా వేకువ జామున తీరం దాటనున్న ఈ తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాన్‌ను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం, ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొం టానికి సిద్ధంగా ఉందన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు భవనాలు, జనరేటర్లు, నీరు, ఆహారం, పాలు, బిస్కెట్లు, మందులను ఆయా కేంద్రాలలో సిద్ధం చేసినట్లు చెప్పారు. వరదల సమయంలో వాగులను ప్రజలు దాటకుండా ఉండటానికి పోలీసు పికెటింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్ల పాడైతే యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**హుకుంపేట :**మండలంలో మోంత్ తుఫాను ప్రభావంతో వరి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి కె.సుధాకర్, తహసీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం హుకుంపేట, సంతారి, పాతకోట, గడిపించమండ, రంగశీల తదితర పంచాయతీలను పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం సమయంలో పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కోత కోసిన పంటకు వర్షం వల్ల ఎక్కువ నష్టం సంభవించే అవకాశం ఉందని, ఇంకా కోత కోయని పంటకు అంతగా ప్రభావం ఉండదని రైతులకు అవగాహన కల్పించారు.వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

**అనంతగిరి:**మండలంలోని కురుస్తున్న మొందా తుఫాను నష్ట నివారణపై పశుసంవర్ధక శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తం అవసరమని కాశీపట్నం. అనంతగిరి పశువు శాఖ డాక్టర్లు గణేశ్వరరావు. అనిల్ . అన్నారు. మంగళవారం కాశీపట్నం గ్రామంలో సిబ్బంది, రైతులకు అవగాహన సూచనలు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వరుషల నేపథ్యంలో మూగజీవులను అడవి ప్రాంతంలో వదిలేయకుండా గ్రామాల వద్ద సురక్ష ప్రాంతాలలో కట్టి ఉంచి అవసరమైన మేతలను వెయ్యాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండి మూగజీవుల మృత్యువాతకు గురికాకుండా చూడాలన్నారు.

# రంపచోడవరాన్ని జిల్లాగా ప్రకటించాలి

### ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

మాట్లాడుతున్న సీసం సురేష్

**ప్రజాశక్తి- విఆర్‌పురం:** రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం కేంద్రంగా నూతన ఏజెన్సీ జిల్లాను ప్రకటించాలని, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా ఉన్న పాడేరు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం రంపచోడవరంలో ఉన్న ఏడు మండ లాలను విలీన మండలాలైన నాలుగు మండలాలను ఏలూరు జిల్లాలోని నాలుగు మండలాలను నాన్‌షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాల ను కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం వలన నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కారం అవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పూనెం ప్రదీప్‌కుమార్, పొడియం శ్రీరామూర్తి, తుర్రం బాబురావు, మిడియం సీతయ్య ,గొర్రె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలి**

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్య కర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్ రెడ్డి,కంభం శాంతి రాజు,తీగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి

**చింతూరు:** రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు, పోలవరం ఏజెన్సీ మండలాలైన 14 మండలాల ప్రాంతాలను కలుపుతూ ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో చింతూరు మండల కార్యదర్శి ముట్టం రాజయ్య, తుమ్మల ఎంపిటిసి, వ్యాక రాజ్‌కుమార్, గిరిజన సంఘం నాయకులు సోడే సాయి తదితరులు పాల్గొన్నారు.

**కూనవరం:** రంపచోడవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాయం సీతారామయ్య బాబుబొర్రయ్య డిమాండ్ చేసారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు తెల్లం తమ్మయ్య, మండల కమిటీ సభ్యులు సోడిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్

# పునరావాస కేంద్రంలో ఆకలి కేకలు

### గ్యాస్ స్టవ్, వంట పాత్రలు తెచ్చి
### చేతులు దులుపుకున్న ప్రభుత్వ యంత్రాంగం
### ఇబ్బంది పడ్డ ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం మత్స్యకారులు

**ప్రజాశక్తి - పరవాడ :** తుపాను బాధితులకు పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించామన్న ప్రభుత్వ మాటలు ఉత్తివేనని తేల్చిచెప్పే ఉదంతమిది. మొంథా తుపాను ప్రభావంతో పరవాడ మండల తీరప్రాంత ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం పునరావాస కేంద్రాలకు తరలించింది. అయితే అక్కడ వారు ఆకలి, దాహం, అసౌకర్యాలతో తీవ్ర ఇబ్బందిపడ్డారు. ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రంలో సుమారు 400 మంది మత్స్యకార కుటుంబాలు ఉండగా ఉదయం 11 గంటలు దాటినా తాగునీరు, అల్పాహారం, పిల్లలకు పాలు, బిస్కెట్లు ఇలా ఏవీ అందించలేదు. దీంతో మహిళలు, పిల్లలు ఆకలితో అలమటించారు. 'రాత్రంతా గాలి, వర్షాలతో భయపడి ఇక్కడికి వచ్చాం. ఇప్పుడు ఆకలితో మరింత బాధపడుతున్నాం' అని ఒక మహిళ కన్నీటి పర్యంతమైంది. చివరికి కొంతమందికి మాత్రమే అధికారులు ఉప్మా అందించారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు ఆలస్యం కావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఆకలితో ఇబ్బందిపడ్డారు. పునరావాస కేంద్రాల్లో వెంటిలేషన్ కొరవడింది. మరుగుదొడ్లు సదుపాయాలు కూడా లేవు. దీంతో మహిళలు ఇబ్బంది పడ్డారు. మరో వైపు తీరంలోని పడవలు, వలలు కొట్టుకుపోతాయని మత్స్యకారులు ఆందోళన చెందారు.

**తప్పుడు సమాచారంతో తిప్పలు**

కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.3 వేలు ఇస్తారని ఒక వ్యక్తి మైక్ ద్వారా ప్రకటించడంతో చాలామంది ఆశతో పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. కానీ ఎటువంటి సహాయమూ ఇప్పటివరకు అందలేదని వారు వాపోయారు.

**ఎమ్మెల్యే పంచకర్ల భరోసా**

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఎవ్వరూ ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఆహారం, పాలు, బిస్కట్లు, తాగునీరు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

**తుపాన్ బాధితులను ఆదుకోవాలి : సిఐటియు**

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుపాను బాధితుల సహాయ శిబిరాలను మంగళవారం సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ సందర్శించారు. శిబిరంలో మత్స్యకారులతో మాట్లాడి సహాయ చర్యలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ సహాయక శిబిరాల్లో 11.30 గంటల వరకు కనీసం ఉప్మా కూడా పెట్టలేదన్నారు. తిక్కవానిపాలెం శిబిరంలో వంట కూడా చేయలేదని కేవలం గ్యాస్ స్టవ్, వంట పాత్రలు మాత్రమే ఈ శిబిరంలో ఉంచారన్నారు. పేరుకే సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి పునరావాస కేంద్రంలో బాధితులకు ఏం కావాలో చూడాలని పలువురు కోరుతున్నారు.

## ముందుకు సాగని రోడ్డు పనులు

### రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు

బురద రోడ్డును పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ భగత్ సింగ్

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయితీ పరిధిలోని రణజిల్డా నిండు దుమ్మగూడ గ్రామం వరకు అడవి తల్లి బాట పేరుతో నిర్మించాల్సిన రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. కొన్ని రోజుల క్రితం రోడ్డు కు రెండు వైపులా మట్టిని లాగి వదిలేసిన గుత్తేదారుడు, ఆ తరువాత పనులను కొనసాగించలేదని సిపిఎం ఉప సర్పంచ్ జన్ని భగత్ రాం అన్నారు. బురద మయంగా ఉన్న రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ జన్ని భగత్ రాం మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడవి తల్లి బాట పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంబించారని, రోడ్డుని అడవి తల్లి బాట పేరుతో బోర్డులు మాత్రమే దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నాయని తెలిపారు. దీంతో రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి, రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ రోడ్డు గుండా గత్తరజిల్ల, శారద బొందుగూడ, బురిడి వలస, కొర్రాయి పంచాయితీ, వివిధ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్డు పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేశారన్నారు. వాహనాలు వెళ్ళడం చాలా కష్టంగా మారిందన్నారు. పిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును వెంటనే అధికారులు చొరవ తీసుకుని పూర్తి చేయాలన్నారు. రోడ్డు సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం ప్రజలతో చేపడతామని డిమాండ్ చేశారు.

## పేరుకుపోయిన చెత్తా చెదారం

### - దుర్వాసనతో జనం ఉక్కిరిబిక్కిరి
### - పట్టించుకోని పంచాయితీ అధికారులు

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:**అరకులోయ మండలం ఎన్టీఆర్ గ్రౌండ్ సమీపంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది.వీధిలో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి శరభగుడ, జెడ్పీ కాలనీ, అరకు ఏరియా ఆసుపత్రిలో నిత్యం విద్యార్థులు , ఉద్యోగులు, గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. చెత్త చెదారంతో ముక్కు మూసుకుని వెళ్ళవసిన పరిస్థితి ఉంది రెండు నెలలు కావస్తున్నా చెత్తా తొలగించక పోవడంతో మరింత దుర్వాసన వెదజల్లుతుండడంతో సరభగూడ ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు పంచాయతీ పాలకులు ప్లాస్టిక్ రహిత అరకులోయ దిద్దుతామని గొప్పలు చెప్పుకునే అధికారులు, పాలకులు ప్లాస్టిక్ కవర్లే ఎందుకు నియంత్రించట్లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అరకులోయలో అధికంగా ప్లాస్టిక్ కవర్లు బాటిల్స్ వాడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్న పరిస్థితి ఉంది.పరిస్థితి తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షం కారణంగా మరింత దుర్వాసన వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.పక్క పక్కన ఇల్లులు ఉండటంతో ముక్కు మూసుకుని వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తా చెదారాన్ని తొలగించి ప్రత్యేక డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన ఉన్న చెత్త

## అదాని స్మార్ట్ మీటర్లు, భూ కేటాయింపులపై విచారణ జరపాలి

### - ప్రభుత్వానికి ఇఎఎస్.శర్మ లేఖ

**ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ :** రాష్ట్రంలో అదానీ గ్రూపుతో గత ప్రభుత్వాలు చేసుకున్న పలు కీలక ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల అంశంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ఆ వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. ముందున్న ప్రభుత్వం ఎంచుకున్న అదానీ స్మార్ట్ మీటర్ల కారణంగా రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు అధిక ఛార్జీలు భరించాల్సి వస్తోందని, ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండటం బాధాకరమని ఆయన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. విశాఖపట్నంలోని మధురవాడలో డేటా సెంటర్ ఏర్పాటు ముసుగులో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల విలువైన 270 ఎకరాల కొండ పోరంబోకు భూమిని చట్టవిరుద్ధంగా అదాని గ్రూప్‌నకు కట్టబెట్టిందని తెలిపారు. తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఎపిఎండిసి మధ్యప్రదేశ్‌లోని సులియారీ బొగ్గు గని మైనింగ్ లీజును తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రమేయంతో ఆ మైనింగ్ పనిని 2021-22లో అదానికి అప్పగించిందని శర్మ తెలిపారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై పడిన అదనపు ఆర్థిక భారంపై నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించాలని కోరారు. అదానికి అప్పగించిన మైనింగ్ పనిని రద్దు చేసి ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సూచించారు. 2014 నుంచి రాష్ట్రంలో వివిధ ప్రభుత్వాలు అదాని కంపెనీలకు భూములను, ఇతర వనరులను ఉదారంగా కేటాయించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదాని గ్రూప్‌తో జరిగిన అన్ని ఒప్పందాలపై, ముఖ్యంగా స్మార్ట్ మీటర్ల విషయంలో వినియోగదారులపై పడుతున్న అదనపు భారంపై ప్రభుత్వం దృష్టి సారించి, ప్రజా ప్రయోజనాలను కాపాడాలని శర్మ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

## కొనసాగుతున్న రైళ్ల రద్దు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** మొంథా తుపాను నేపథ్యంలో వాల్తేరు రైల్వే డివిజన్ మార్గాల్లో నడిచే పలు రైళ్లను మూడు రోజులపాటు అధికారులు రద్దు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 28న విశాఖ నుంచి బయలుదేరాల్సిన 12727 విశాఖపట్నం - హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, 22203 విశాఖపట్నం - సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్, 20811 విశాఖపట్నం - నాందేడ్ ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖపట్నం - సికింద్రాబాద్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్, 20805 విశాఖపట్నం - న్యూ ఢిల్లీ ఎపి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 18519 విశాఖపట్నం ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 12861 విశాఖపట్నం - మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, 18515 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ (రాయగడ నుండి), 11020 భువనేశ్వర్ - ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (భువనేశ్వర్ నుండి), 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (లింగంపల్లి నుండి), 18046 హైదరాబాద్ - శాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్ నుండి), 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ నుండి), 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ నుండి), 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ (గుంటూరు నుండి), 07165 హైదరాబాద్-భువనేశ్వర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్ నుండి), 17480 తిరుపతి - పూరీ ఎక్స్‌ప్రెస్ (తిరుపతి నుండి), 18522 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్ (కడప నుండి) రద్దయ్యాయి. 29న 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 18516 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 07166 భువనేశ్వర్ - హైదరాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 30న 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 11019 సిఎస్‌టి ముంబై - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 17479 పూరీ - తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. సుదూర ప్రాంత రైళ్లను దారి మళ్లించారు.

## వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం

**ప్రజాశక్తి - జీకే వీధి :** మండలంలో మొంథా తుఫాన్ నేపథ్యంలో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ అప్పలస్వామి, సహాయ వ్యవసాయ సంచాలకులు తిరుమలరావు మండల వ్యవసాయ అధికారి గిరిబాబు మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రింతా డ, అసరాడ, ఏబులం గ్రామాల్లో పొలాలు పరిశీలించారు. పొలాల్లో చిన్న చిన్న కాలువలు ఏర్పాటు చేసుకొని నీరు తొలగించాలని సూచిం చారు. మానిపండు తెగులు ఉందని దీని నివారణకు ప్రొపికోనాజోల్ పొడి మందుని పిచికారీ చేయవలసిందిగా సూచించారు. ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకంలో భాగంగా రైతులకు మినుములు విత్తనాలు ఉచితంగా అందిస్తామని తెలియజేశారు.